క్లుప్తంగా

చెక్కులు అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలోని 154మంది లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తన నివాసంలో రూ.58.78లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని, ఎంతో మంది పేద ప్రజలకు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

రామకృష్ణాపూర్: భట్రాజు సంఘం జిల్లా నూతన కమిటీని శనివారం గద్దెరాగిడిలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చక్రధరి సురేందర్‌రాజు, ఉపాధ్యక్షులుగా చెన్న మాధవుని శ్రీధర్‌రాజు, విలాసకవి వెంకట్రాజు, ప్రధాన కార్యదర్శిగా అరవరాజు శ్రీనివాస్‌రాజు, కార్యదర్శులుగా కూరపాటి చంద్రశేఖర్‌రాజు, దేవరాజు ఆదర్శవర్ధన్‌రాజు, కో శాధికారిగా చిన్న మాధవుని విజయేందర్‌రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా బిరుదురాజు శ్రీధర్‌రాజు, సాంస్కృతిక, ప్రచార కార్యదర్శిగా రాధాకిషన్‌రాజు, క్రీడా వ్యవహార కార్యదర్శిగా సంతోష్‌రాజును ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా తుమికి శంకర్‌రాజు, భాస్కర్‌రాజును ఎనుకున్నారు.

సీపీఆర్‌పై అవగాహన

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 2వ వార్డు జ్యోతినగర్‌లో శనివారం ప్రభుత్వ వైద్యురాలు మానస సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానాన్ని డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శ్యామలకు సన్మానం

బెల్లంపల్లి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం శ్యామలను శాలువాతో సత్కరించారు. బెల్లంపల్లి మండల సమాఖ్యకు స్త్రీనిధిలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును సెర్ప్‌సీఈవోకు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ కుమారస్వామి, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలటౌన్: ప్రస్తుత వేసవి కాలంలో ఎండలు పెరుగుతున్నాయని, వడదెబ్బ నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం వడదెబ్బ తగలకుండా ఉండేందుకుగాను ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లను డీఎంహెచ్‌వో ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు పోస్టర్లు పంపించి, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయపూర్ణిమ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డీపీవో ప్రశాంతి, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తోళ్లవాగుప్రాంతాన్ని శనివారం ఆర్డీవో వేణు, తహసీల్దార్ రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఏర్పాటు చేసిన నిర్మాణాలను పూర్తిగా తొలగించేలా చర్యలు చేపట్టారు.

క్రీడా ప్రాంగణాల స్థల పరిశీలన

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారంలో ఏర్పాటు చేసే నూతన తెలంగాణ క్రీడాప్రాంగణ స్థలాన్ని శనివారం మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. త్వరితగతిన క్రీడా ప్రాంగణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్ఐ గణేశ్, సర్వేయర్ మణిరాజ్, జెడ్పీటీసీ సింగతి శ్యామల, సర్పంచ్ శంకర్, అటవీశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల కోసం గుర్తించిన ప్రభుత్వ భూములను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. మండలంలోని బట్వాన్‌పల్లి, లంబాడి తండా, పెర్కపల్లి గ్రామాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాల కోసం ఎంపిక చేసిన స్థలాలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు తగు సూచనలు చేశారు. ఎంపిక చేసిన క్రీడా ప్రాంగణాల స్థలాల విషయంలో ఎలాంటి వివాదం లేకుండా చూడాలని ఆదేశించారు.

టేస్టీ జ్యూస్..!

సండే స్పెషల్



జ్యూస్ సెంటర్ వద్ద పండ్ల రసం తాగేందుకు వచ్చిన స్థానికులు

- ఊపందుకున్న చల్లని పానీయాల గిరాకీ
- అందుబాటులో వివిధ రకాల పండ్ల రసాలు
- జిల్లా కేంద్రం, పట్టణాల్లో వెలిసిన దుకాణాలు
- ఆసక్తి చూపిస్తున్న ప్రజలు



మంచిర్యాలటౌన్: మండుతున్న ఎండల నేపథ్యంలో చల్లని పానీయాల వ్యాపారం ఊపందుకుంటోంది. చల్లని పానీయాలు సేవిస్తూ ఎండ వేడి నుంచి సేద తీరుతున్నారు ప్రజలు. వివిధ రకాల పండ్ల రసాలతో పాటు చెరుకురసం, కొబ్బరి బోండాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు, మండల కేంద్రాల్లోనూ జ్యూస్ సెంటర్లు, కొబ్బరి బోండాలు, చెరుకు రసాల అమ్మకాలతో పాటు లస్సీ, మజ్జిగ అమ్మకాల దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. వేసవిలో డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విక్రయదారులు దుకా ణాలు ఏర్పాటు చేస్తున్నారు. కోవిడ్ సమయంలో చల్లని పానీయాల దుకాణాలు ఏర్పాటు చేయకపోవడం, కరోనా భయంతో వీటికి ప్రజలు దూరంగా ఉండడంతో వ్యాపారం సక్రమంగా సాగలేదు. గతేడాది నుంచే చల్లని పానీయాల దుకాణాలకు పూర్వ పు వైభవం వచ్చింది. ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం ఏదో ఒక చల్లని పానీయాన్ని సేవిస్తున్నారు. ప్రజల డిమాండ్‌కు తగినట్లుగా పలు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో గిరాకీ మరింత పుంజుకునే అవకాశం ఉంది.

ఎండ వేడి తట్టుకునేందుకే..



రోజురోజుకు పెరుగుతున్న ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకుంటున్నాం. వేసవిలో శరీరం నుంచి చెమట రూపంలో నీరు, లవణాలు బయటకు వెళ్లిపోతాయి. ఈ సమయంలోనే శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్ర మాదం ఉంది. అందుకే చెమట ఎక్కువగా వే సినప్పుడు బయటకు వెళ్లే లవణాలను భర్తీ చే సేందుకు కొబ్బరి బోండాం గానీ, ఇతర పానీ యాలను గానీ తీసుకునేందుకు ఇష్టపడతాను.

– జి. వెంకటస్వామి, రామకృష్ణాపూర్

వేసవిలో గిరాకీ ఎక్కువ



ఎండ వేడి పెరగడంతో ఎక్కువగా జ్యూస్ సెంటర్‌కు వస్తున్నారు. మజ్జిగ, లస్సితో పాటు, పండ్ల రసాలను తీసుకుంటున్నారు. లస్సీని ఐస్‌క్రీంతో కలిపి తీసుకునేందుకు ఎక్కువ ఇష్టపడుతున్నారు. మిల్క్‌షేక్, ఐస్‌గోలా, చెరుకురసం అమ్మకాలు ఎక్కువగా పెరుగుతున్నాయి. గతేడాది నుంచి జ్యూస్ సెంటర్లు మంచి గిరాకీ అందుకున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికైతే మంచి గిరాకీ ఉంటుంది.

– రాజేశ్, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు, మంచిర్యాల

అందుబాటులో పండ్ల రసాలు



వేసవికాలంలో పండ్ల రసాలకు ఎక్కువగా గిరాకీ ఉంటుంది. పైనాపిల్, సపోటా, గ్రేప్స్ జ్యూస్, చెరుకు రసంతో పాటు లస్సీ, మజ్జిగ ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి. జ్యూస్ ఒక్కో రకానికి సంబంధించిన గ్లాస్ ధర ఒక్కోలా ఉన్నాయి. రూ.20నుంచి రూ.40వరకు ఆయా పండ్లను బట్టి ఆయా ధరలకు అమ్ముతున్నారు. వీటితో పాటు చల్లని లస్సీ గ్లాస్ రూ.20నుంచి రూ.30వరకు, చెరుకు, మోసంబీ జ్యూస్‌లను గ్లాస్‌కు రూ.20నుంచి ధరలు అందుబాటులో ఉన్నాయి. మిల్క్‌షేక్‌లలో రోజ్‌మిల్క్, చాకోలేట్‌మిల్క్, బాదాం మిల్క్, కోల్డ్ కాఫీ, కాజుల ధరలు రూ.50నుంచి రూ.80వరకు ఉన్నాయి. వేసవి మండుటెండల్లో వివిధ పనుల నిమిత్తం బయట తిరిగేవారు పండ్ల రసాలను తీసుకునేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. నిమ్మరసం, కొబ్బరి బోండాలతో పాటు, పండ్లను నేరుగా తీసుకుంటేనే శరీరం నుంచి బయటకు వెళ్లిన నీటి శాతాన్ని అదుపులో ఉండడంతో శరీరానికి అదనపు శక్తి లభిస్తుంది. ధరలు కూడా అందుబాటులో ఉండడంతో వీటిని తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

తైబజార్ వేలం మరోసారి వాయిదా..!

- మూడోసారి వేలం నిర్వహణకు కసరత్తు
- ఈ సారైన నిబంధనలకు లోబడి పూర్తయ్యేనా..?



దరఖాస్తులు చూపుతున్న పట్టణవాసులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ పన్ను వసూలు (తైబజార్)తో పాటు పశువుల సంతల వేలం రెండోసారి వాయిదా పడ్డాయి. మార్చి 29న నిర్వహించిన వేలంలో గుత్తేదారులు ఎవరూ హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు. వేలానికి శుక్రవారం గుత్తేదారులు తరలివచ్చారు. మున్సిపాలిటీ నియమ నిబంధనల ప్రకారం దరఖాస్తుతో పాటు బ్యాంక్‌లో ఎలాంటి అప్పులేదని ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాల్సి ఉంది. ఆ గుత్తేదారులు సమర్పించిన దరఖాస్తులలో నో డ్యూ సర్టిఫికేట్లు లేకపోవడంతో అధికారులు దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తుదారులు మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం దరఖాస్తులు సమర్పించకపోవడంతో వేలంను వాయిదా వేసినట్లు తెలిపారు.

అధికారులు కావాలనే వాయిదా వేశారు..

మార్చి నెల ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో బ్యాంకర్లు నో డ్యూ సర్టిఫికేట్లు ఇవ్వలేదని గుత్తేదారులు పేర్కొన్నారు. వేలం పూర్తయిన తర్వాత నో డ్యూ ధ్రువీకరణ పత్రాలను సమర్పిస్తామని చెప్పినా, అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారులు కావాలనే వేలాన్ని వాయిదా వేశారని గుత్తేదారులు ఆరోపించారు.

మరోసారి నిర్వహిస్తాం..



మూడో సారి తైబజార్ వేలంకు తేదీని ప్రకటిస్తాం. మూడోసారి మున్సిపాల్ నిబంధనల ప్రకారం దరఖాస్తులు వస్తే వేలం నిర్వహిస్తాం. మూడోసారి సైతం గుత్తేదారులు ఆసక్తి చూపించనట్‌లెతై కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిల్ సభ్యుల తీర్మానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్

హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్షణ

- ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్



'సేవ్ లైఫ్' అంటూ హెల్మెట్ ధరించి అవగాహన

మంచిర్యాలక్రైం: ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్షణగా ఉంటుందంటూ శనివారం స్థానిక ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగంపై స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులతో జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు తెల్ల కలర్ టీషర్ట్స్, హెల్మెట్ ధరించి 'సేవ్ లైఫ్' అంటూ ప్రచారం చేశారు. అనంతరం హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారికి గులాబీ పుష్పం ఇచ్చి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్యలో అధికశాతం హెల్మెట్ ధరించని వారే మృతి చెందినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నావని గుర్తు చేశారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు, ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



లంబాడితండాలో దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

బెల్లంపల్లి: ఎస్సీ రిజర్వేషన్‌ను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దుర్వినియోగ పర్చారని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు కొయ్యల ఏమాజీ అన్నారు. బెల్లంపల్లి మండలం లంబాడి తండా వద్ద ప్రధానరోడ్డు పై శనివారం ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. రోడ్డుపై కొద్దిసేపు రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను నిలువరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేతకాని సామాజిక వర్గానికి చెందిన చిన్నయ్య కన్వర్టెడ్ క్రిస్టియన్ అని అన్నారు. కన్వర్టెడ్ క్రిస్టియన్ బీసీ కిందికి వస్తారని, మరి చిన్నయ్య ఎస్సీ ఎలా అవుతారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని రాష్ట్ర స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.కేశవరెడ్డి, కె.గోవర్ధన్, రాజులాల్ యాదవ్, అజ్మీరా శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్, సుభాష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై చెప్పు విసిరిన మహిళ



బెల్లంపల్లి: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ మహిళా చెప్పు విసిరిన ఘటన వెలుగు చూసింది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన శనివారం బహిర్గతమైంది. వివరాల్లోకి వెళ్తే.. బెల్లంపల్లి వైపు నుంచి భార్యభర్తలు మోటారుసైకిల్‌పై మంచిర్యాల వైపునకు వెళ్తున్నారు. వారి వెనకాలే మంచిర్యాల డిపోకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు వెళ్తోంది. సరిగ్గా రైల్వేస్టేషన్ వద్దకు చేరుకోగానే మోటారు సైకిల్‌ను ఓవర్ టేక్ చేస్తూ ఆర్టీసీ డ్రైవర్ ముందుకువెళ్లాడు. తృటిలో ఆర్టీసీ బస్సు ఢీకొనకుండా బైక్‌పై వెళ్తున్న భార్యభర్తలు తప్పించుకున్నారు. దీంతో ఆ భార్యభర్తలు ఆర్టీసీ బస్సును ఆపి ఆర్టీసీ డ్రైవర్‌తో వాగ్వివాదానికి దిగారు. కొంచెం ఆలస్యమైతే తాము ప్రమాదానికి గురయ్యేవారమని, తమప్రాణాలు పోతే ఎలా అని డ్రైవర్‌పై ఆగ్రహం చెందారు. దీంతో డ్రైవర్ సైతం మహిళను దుర్భాషలాడటంతో కట్టలు తెంచుకున్న కోపంతో సదరు మహిళా తన కాలికి ఉన్న చెప్పు తీసి డ్రైవర్‌పై విసిరింది. ఘర్షణ తీవ్రతరం అవుతున్న క్రమంలో కొందరు సర్దిచెప్పడంతో ఆర్టీసీ బస్సు ముందుకు సాగింది. ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

సమాజం గర్వపడేలా విద్యార్థులు ఎదగాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

తాండూర్: సమాజం గర్వపడేలా విద్యార్థులు ఉన్నతస్థితికి ఎదగాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండల కేంద్రంలో ని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెంచుకుంటారని, ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కళలను నెరవేర్చడానికి కృషి చేయాలన్నారు. దురలవాట్లకు బానిసకాకుండా కేవలం చదువుపైనే దృష్టి సారిస్తే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం కాదన్నారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినీ, జానపద గీతాలపై విద్యార్థులు చేసిన నృత్యాలు అమితంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాభారతి హైస్కూల్ కరస్పాండెంట్ సురభి శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ సరోజిని, జెడ్పీటీసీ సభ్యుడు సాలిగామ బానయ్య, మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు పూసాల ప్రణయ్‌కుమార్, సర్పంచ్ పూదరి నవీన్, మండల కోఆప్షన్ సభ్యుడు రహమత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నాగవెల్లి డోలోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం దేవాలయంలో శనివారం రాత్రి నాగవెల్లి డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీపాలంకరణ, ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు అంబప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ముస్లింలకు హనుమాన్ దీక్షా స్వాముల ఇఫ్తార్ విందు



దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో ముస్లింలకు హనుమాన్ దీక్ష స్వాములు శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. స్థానిక మసీదు వద్ద ఏర్పాటు చేసిన విందులో ముస్లింలు పాల్గొని విందు స్వీకరించారు.

'ఆరోగ్యానికి చిరుధాన్యాలే శ్రేయస్కరం'



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు

వేమనపల్లి: చిరుధాన్యాలే ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, రజిత అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం పోషణ్ పక్వాడలో భాగంగా కూరగాయలు, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరి, ఏపీఎం ఉమారాణి, సీసీలు శివరాం, శ్రీధర్‌గౌడ్, రాజారాం, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చేశారు. సూపర్‌వైజర్ సంధ్య, ఏఎన్ఎం గ్లోరీ, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లి అంగన్‌వాడీ సెంటర్-2లో బాలింతలు, గర్భిణులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, రక్తహీనత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డునే కుదించి డ్రైయినేజీ నిర్మాణం

- వెంచర్ యజమానులకు లాభం చేకూర్చేందుకేనని ఆరోపణలు



డ్రైయినేజీని తొలగిస్తున్న దృశ్యం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో డ్రైయినేజీ నిర్మాణాలను ఇష్టారీతిన కాంట్రాక్టర్లు నిర్మిస్తుంటే అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. 26వ వార్డు రాళ్లపేట్‌లో 40ఫీట్ల రోడ్డుకు ఒక పక్కనా మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.2.50లక్షలతో డ్రైయినేజీని నిర్మించేందుకు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ 40ఫీట్ల రోడ్డు ఉండేలా డ్రైయినేజీని నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా, పక్కనే ఉన్న వెంచర్ యజమానులకు లబ్ధిచేకూరేలా, ముందుకు వెళుతున్నా కొద్ది రోడ్డు వెడల్పును 40నుంచి కొద్దికొద్దిగా తగ్గిస్తూ 21ఫీట్లకు పరిమితం చేశాడు. దీంతో పక్కనే ఉన్న వెంచర్ యజమానులకు 19ఫీట్ల మేర రోడ్డుకు సంబంధించిన భూమి కలిసొచ్చినట్లయ్యింది. డ్రైయినేజీని నిర్మించిన నెల రోజుల తరువాత మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా మేలుకున్నారు. సదరు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన బిల్లులు నిలిపివేసి, 40ఫీట్ల రోడ్డు ఉండేలా డ్రైయినేజీని నిర్మాణం చేయాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. దీంతో నిర్మించిన డ్రైయినేజీని శనివారం జేసీబీతో తొలగించే పనులు ప్రారంభించారు. మున్సిపాలిటీలో ఇప్పటికే పలు రోడ్లు ఆక్రమణకు గురై, ఇరుకుగా మారుతున్నాయి. మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న ప్రకారంగానే రోడ్లు, వాటికి అనుగుణంగా డ్రైయినేజీలు నిర్మించాల్సి ఉన్నా, కొందరి స్వార్థం కోసం రోడ్లు కుదిస్తున్నారు. రోడ్ల ఆక్రమణ యథేచ్ఛగా జరుగుతున్నా, పాలకవర్గం గానీ, అధికారులు గాని స్పందించక పోవడం, ప్రజలు ఫిర్యాదు చేస్తేనే అప్పుడప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారుతోంది. మున్సిపల్ ఇంజనీర్లు చెప్పినట్లుగా డ్రైయినేజీ నిర్మాణం చేయాల్సిన సదరు కాంట్రాక్టర్, పక్కనే ఉన్న స్థల యమజానులు చెప్పినట్లుగా నిర్మించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ ఇంజనీర్ మధుకర్‌ను వివరణ కోరగా రోడ్డు వెడల్పును తగ్గించి, డ్రైయినేజీని నిర్మించినట్లు గుర్తించామని, ఆ కాంట్రాక్టర్‌కు సంబంధిత బిల్లులు నిలిపివేసి, డ్రైయినేజీ తొలగించి, మరోసారి 40ఫీట్ల రోడ్డు ఉండేలా నిర్మించాలని ఆదేశించినట్లు తెలిపారు.

వాడీవేడిగా మండల సమావేశం

బెల్లంపల్లి: పొట్టకూటి కోసం రెక్కలు ముక్కలు చేసుకున్న ఉపాధిహామీ కూలీలకు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వేతనాలను చెల్లించకుండా ఎంతకాలం పెండింగ్‌లో ఉంచి కూలీలను ఇబ్బందులకు గురి చేస్తారని అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో మండల సమావేశం అట్టుడికింది. బెల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రజాసమస్యలను లేవనెత్తి ప్రభుత్వ శాఖల అధికారుల తీరుపై అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. బట్వాన్‌పల్లిలో ఈజీఎస్ కూలీలకు రూ.10లక్షలు చెల్లించాల్సి ఉందని, నెలలు గడిచినా చెల్లించడం లేదని ఎంపీపీ గోమాస శ్రీనివాస్, ఇతర సభ్యులు ఇన్‌చార్జి ఏపీఓ అనిల్‌ను నిలదీశా రు. ఈ విషయంలో ఇన్‌చార్జీ ఏపీఓ అనిల్ సమాధానం చెబుతూ.. పెండింగ్ వేతనాల విషయం తనకు తెలియదని ఇటీవలనే తాను ఇన్‌చార్జీ ఏపీఓగా బాధ్యతలు చేపట్టానని, పెండింగ్ వేతనాల విషయాన్ని వెంటనే ఉన్నతాధికారులకు నివేదించి చెల్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. బుధాకుర్దులో లో, హై ఓల్టేజీ సమస్యతో గృహోపకరణ వస్తువులు కాలి పోతున్నాయని సభ్యులు కృష్ణమూర్తి, రాణి తెలిపారు. ఎజెండాలో ఉన్న అంశాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీవో శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి పావని, ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ, వ్యవసాయ అధికారి వందన, తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యాధికారి అనీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, ఎంఈవో మహేశ్వర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ పరంజ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'అలవెన్సుల ఫ్రీజ్‌పై తప్పుడు ప్రచారం'

శ్రీరాంపూర్: 11వ వేతన ఒప్పందంలో యాజమాన్యం అలవెన్సులను పెంచకుండా ఫ్రీజ్ చేయడానికి తమ సంఘం ఒప్పుకుందని హెచ్ఎమ్మెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఓడీఎఫ్‌పై శిక్షణ

జైపూర్: తడి, పొడి చెత్త నిర్వహణ, వ్యర్థ నీరు నిర్వహణ(ఓడీఎఫ్) గ్రామాలుగా తీర్చిద్దడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్యదర్శులతో పాటు ఉపాధిహామీ, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఎం సమన్వయకర్తలు రాజేందర్, మల్లేశ్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఓడీఎఫ్ ప్లస్‌గా తీర్చిదిద్దడానికి అమలు చేయాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఎంపీడీవోకు వినతి

కాసిపేట: పేద ముస్లిం కుటుంబాలకు మైనర్టీ రుణాలు ఇవ్వాలని మండల మైనర్టీ మోర్చా అధ్యక్షుడు యూసఫ్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో ఎంఏ అలీంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రమేష్, సంపత్‌కుమార్, నరేష్, పోశం తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు సీజ్

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట శివారులో అనుమతి తేదీ దాటినప్పటికీ అక్రమంగా మొరం తరలిస్తున్న డంపర్‌తో పాటు జేసీబీని తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. క్రమంగా మట్టి, ఇసుక, మొరం తరలించినా నేరమని అన్నారు. సీజ్ చేసిన వాహనాలకు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ, తదుపరి చర్యలకు పోలీస్‌స్టేషన్లో అప్పగించారు.

హక్కుల కోసం పోరాడాలి

లక్సెట్టిపేట: మాదిగ హక్కుల కోసం పోరాటం చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాజనర్సు అన్నారు. స్థానిక ఐబీ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ హక్కుల సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి చైతన్య పర్చాలని కోరారు. అనంతరం పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కిషన్‌ను నియమించి నియామకపత్రం అందించారు.